ఆరు నెలల్లో సీఎం రేవంత్ జైలుకు

- ఓటుకు నోటు కేసులో విచారణ పూర్తి
- ఇక శిక్ష ఖరారు కావడమే మిగిలింది
- మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : ఓటుకు నోటు కేసులో విచారణ పూర్తయిందని, మరో ఆరు నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డికి శిక్ష పడటం ఖాయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలపై సీఎం నోటికి వచ్చినట్టు మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం సమంజసం కాదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఏక్‌నాథ్ షిండే అయ్యేది సీఎం రేవంతేనని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి 'పాథలాజికల్ లయ్యర్' అంటూ దుయ్యబట్టారు. రేవంత్ రోగలక్షణమే అబద్ధాలు చెప్పడం అని, అలా ప్రతి నిత్యం అబద్ధాలు ఆడటమే పనిగా పెట్టుకునే వాడిని పాథలాజికల్ లయ్యర్ అంటారని వివరించారు. తమ నేత హరీశ్‌రావుపై సీఎం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని రేవంత్‌రెడ్డి గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ తెల్లమొఖం!

మొదటిపేజీ తరువాయి...

నీటిపారుదల రంగం-శ్వేతపత్రం'పై లఘు చర్చ ఉంటుందని ప్రకటించారు. శాసనసభ బులెటిన్ కూడా గురువారం విడుదల చేసి మరీ చెప్పారు. ప్రభుత్వం కూడా ఇదే ప్రకటించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా శుక్రవారం శ్వేతపత్రాన్ని విడుదల చేస్తామని, ఇరిగేషన్‌పై ప్రజెంటేషన్ ఉంటుందని చెప్పారు. సభలోపల కూడా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం చెప్పడంతో ప్రతిపక్ష పార్టీలు సిద్ధమై వచ్చాయి. దాదాపు సభ్యులంతా అందుబాటులో ఉన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం శుక్రవారం సభను నిర్వహించిన తీరును చూస్తే చర్చకు సిద్ధంగా లేదన్న సూచనలు కనిపించాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు నాలుగు గంటలకుపైగా జీరో అవర్ జరిగింది. ఏకంగా 33 మంది శాసన సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించినప్పుడే ప్రతిపక్ష సభ్యులకు అనుమానం మొదలైంది. ఆ తర్వాత కులగణనపై చర్చ జరిగింది. సాయంత్రం 4 గంటలకు శ్వేతపత్రంపై చర్చ మొదలవుతుందనుకున్న దశలో.. సభకు 'టీ బ్రేక్' అంటూ విరామం ఇచ్చారు. ఈ విరామం దాదాపు రెండు గంటలపాటు కొనసాగింది. అనంతరం 6 గంటలకు సభ ప్రారంభం కాగానే 'ఆలస్యం' అయ్యిందన్న కారణంతో వాయిదా వేయాలని కాంగ్రెస్ సభ్యులు కోరారు. గురువారం సభ రాత్రి 9 గంటల వరకు కొనసాగిందని, మండలి 11 గంటల వరకు కొనసాగిందని, ఇదే తరహాలో కనీసం నాలుగైదు గంటలు చర్చ జరుపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీజేపీ సభ్యులు కోరినా వినలేదు. హడావిడిగా శనివారానికి వాయిదా వేశారు.

'ప్రిపేర్' కాలేదనే వాయిదా?

నీటిపారుదల రంగం శ్వేతపత్రంపై చర్చను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేసిందని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం 'ప్రిపేర్' కాకపోవడం ప్రధాన కారణం కాగా.. శనివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభకు పరిమితం చేసేందుకే ప్రభుత్వం చర్చను వాయిదా వేసిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్నది. బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి సైతం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 'నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రిపేర్ కాలేదా?' అని ప్రశ్నించారు. అయినా ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదు. సభ వాయిదా పడగానే 'ఉత్తమ్ సిద్ధం కాలేదేమో' అని అసెంబ్లీ లాబీలో చర్చ జరిగింది. గతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడి జైన్‌పై అసెంబ్లీలో చర్చించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించగా.. ప్రతిపక్ష నేతగా ఉన్న ఉత్తమ్ 'మేం ప్రిపేర్ కాలేదు' అని జారుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ఇలాగే జరిగిందంటూ జోకులు పేలాయి.

విపక్షం సిద్ధం.. అధికార పక్షం పరార్

సాధారణంగా సభలో అధికార పక్షం చర్చకు పెడితే ప్రతిపక్షం సమాధానం చెప్పలేక వాయిదా కోరుతుంది లేదా జారుకుంటుంది. కానీ, శుక్రవారం విపక్షాలు చర్చకు పట్టుబట్టగా ప్రభుత్వం సభను వాయిదా వేసుకొని జారుకొన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శ్వేతపత్రంపై చర్చకు సిద్ధమని ప్రతిపక్షం చెప్తుంటే, అధికార పక్షం మాత్రం వాయిదా వేసుకున్నదని అంటున్నారు. 'మంత్రి ఉత్తమ్‌కు అదనంగా దాదాపు 10 మంది ఎమ్మెల్యేలను చర్చలో మాట్లాడేందుకు సిద్ధం చేయించారట. అయినా ఎందుకు వాయిదా వేశారో' అని కొందరు నేతలు ఆశ్చర్యపోగా.. 'కేఆర్ఎంబీపై, కాళేశ్వరంపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు అధికార పక్షాన్ని ఏ రేంజ్‌లో ఆడుకున్నారో గుర్తుకువచ్చి ఉంటుంది. అందుకే మరింత ప్రిపేర్ అయ్యేందుకు వాయిదా వేశారు' అని బీఆర్ఎస్ నేతలు కామెంట్ చేశారు. వాస్తవానికి ఈ నెల 15వ తేదీ వరకే సభ నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. చివరి నిమిషంలో గురువారానికి పొడిగించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ గురువారం ముగిస్తామని ప్రభుత్వం తరపు నుంచి హామీ రావడంతో ప్రతిపక్ష నేతలు ఇతర కార్యక్రమాలకు షెడ్యూల్ వేసుకున్నారు. గురువారం కూడా సభలో ఎజెండా పూర్తికాకపోవడంతో శుక్రవారం సమావేశాలను ముగిస్తామని, ఇరిగేషన్‌పై చర్చ ఉంటుందని చెప్పింది. కానీ ప్రభుత్వం అర్ధంతరంగా వాయిదా వేసి మరోరోజు సమావేశాలను పొడిగించి శనివారం నీటిపారుదల రంగంపై చర్చ పెట్టడంతో ఎమ్మెల్యేలకు ఇబ్బంది తప్పడం లేదు.

కీలక సమావేశంపై తీవ్ర నిర్లక్ష్యం

కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులను అప్పగిస్తామని ప్రభుత్వం కేంద్రానికి హామీ ఇవ్వటం, దానిపై విపక్ష బీఆర్ఎస్ పోరు తీవ్రం చేయటంతో రేవంత్ సర్కారు మాటమార్చి ప్రాజెక్టులు అప్పగించబోమని ప్రకటించింది. ప్రాజెక్టుల అప్పగింత అంశంపైనే శుక్రవారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ మరో సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ భేటీకి వస్తామని ముందుగా చెప్పిన తెలంగాణ ప్రభుత్వం తీరా ఒకరోజు ముందు అసెంబ్లీలో ఇరిగేషన్‌పై శ్వేతపత్రం విడుదల ఉన్నందున రాలేమని లేఖ రాసింది. అసెంబ్లీలో శ్వేతపత్రం పెట్టేది ముఖ్యమంత్రో, సంబంధిత శాఖ మంత్రో చేస్తారు. ఢిల్లీ సమావేశానికి హాజరు కావాల్సింది అధికారులు. మరి ఢిల్లీ మీటింగ్‌కు అధికారులు వెళ్లేందుకు అసెంబ్లీలో శ్వేతపత్రం పెట్టడం అడ్డెలా అవుతుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇంత కీలకమైన సమావేశానికి డుమ్మా కొట్టిన ప్రభుత్వం.. ఇటు శ్వేతపత్రమైనా పెట్టిందా అంటే అదీ లేదు. కారణం చెప్పకుండానే ఆ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేసింది. దీన్నిబట్టే ప్రభుత్వం ఎంత డొల్లతనంగా వ్యవహరిస్తున్నదో అర్థమవుతున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి.

విపక్ష నేత కోసం అధికారపక్షం డిమాండ్

అసెంబ్లీ సమావేశాల్లో సాధారణంగా సభా నాయకుడు సభకు వచ్చి సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని విపక్ష సభ్యులు తరుచూ పట్టుబట్టడం చూస్తుంటాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి సీన్ రివర్స్‌లో సాగుతున్నది. ప్రతిపక్ష నాయకుడు సభకు రావాలని సాక్షాత్తూ సభా నాయకుడైన సీఎం పదేపదే కోరటం విడ్డూరమని రాజ్యాంగ కోవిధులు అంటున్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో కూడా సీరియస్ అంశాలను సైతం పక్కనబెట్టి తరుచూ చర్చను విపక్ష నేత కేసీఆర్ చుట్టూనే తిప్పుతున్నారు. సీఎం అయితే తన స్థాయిని దిగజార్చుకొని విపక్ష నేతను బూతులు తిడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్చకు ప్రభుత్వమే పలాయనమా?

- ఇరిగేషన్‌పై చర్చకు ఆ శాఖ మంత్రే సిద్ధంగా లేకుంటే ఎలా?
- నీటిపారుదల రంగంపై శ్వేతపత్రం ఎందుకు విడుదల చేయలేదు?
- ప్రభుత్వానికి ప్రతిపక్షాల ప్రశ్నలు
- పట్టించుకోని ప్రభుత్వం.. చర్చ నేటికి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): సాగునీటిపారుదల రంగంపై అసెంబ్లీలో చర్చిద్దామని చెప్పి.. ప్రభుత్వమే అందుకు సిద్ధంగా లేమని చెప్పటమేమిటని విపక్ష సభ్యులు ప్రశ్నించారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు సిద్ధంకాలేదని ఎలా చెప్తారని నిలదీశారు. నీటిపారుదల రంగంపై శ్వేతపత్రాన్ని ప్రకటిస్తామని అసెంబ్లీ ఎజెండాలో పెట్టిన ప్రభుత్వం, చర్చకు ఎందుకు వెనకాడుతున్నదని మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీలో బీసీ జనగణనపై చర్చ అనంతరం సభను టీ విరామానికి వాయిదా వేశారు. ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులను స్పీకర్ చర్చలకు ఆహ్వానించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం సభ్యులు హాజరయ్యారు. నీటిపారుదల రంగంపై శనివారం చర్చిద్దామని ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకు విపక్షాలు తిరస్కరించాయి. శుక్రవారం ఆర్ధరాత్రి వరకైనా చర్చిద్దామని పట్టుబట్టాయి. కానీ, చర్చకు ప్రభుత్వం నిరాకరించింది. శ్వేతపత్రం ప్రకటన, చర్చను శనివారం చేపట్టనున్నట్టు ప్రకటించి అసెంబ్లీని వాయిదా వేశారు.

చర్చకు ప్రభుత్వమే వెనుకాడటం ఏమిటి?

అసెంబ్లీ ఎజెండాలో పెట్టిన అంశంపై ప్రభుత్వమే చర్చకు వెనుకాడటం ఏమిటని విపక్షాలు నిలదీశాయి. శుక్రవారం కాకపోతే ఈ అంశంపై మేడారం జాతర అనంతరం 25వ తేదీ తరువాత చర్చ పెట్టాలని, అప్పటి వరకు వాయిదా వేయాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు సూచించారు. కానీ, ఈ సూచనను ప్రభుత్వం పట్టించుకోలేదు. సభ్యులంతా వెనక్కు పోతున్నారని నిలదీశారు. మంత్రి ఉత్తమ్ ప్రిపేర్ కాలేదా? అని ఏద్దేవా చేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయాలని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేత హైకోర్టులో కేసు కూడా వేశారని తెలిపారు. సీబీఐకి ఇవ్వడానికి ఇప్పుడు ఎందుకు వెనక్కి వెళ్తున్నారని నిలదీశారు. అయితే ఎంఐఎం సభ్యుడు జాఫర్ హుస్సేన్ మాత్రం శనివారం చర్చిద్దామని, సభను వాయిదా వేయాలని కోరారు. దీంతో సభను స్పీకర్ శనివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

మంత్రి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలి

సభలో లేని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అప్పటివరకు నీటిపారుదల రంగంపై చర్చలో తమ అభిప్రాయాన్ని చెప్పబోమని తేల్చి చెప్పారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ ప్రకటించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి సీఎంను కాల్చిపారేయ్యాలని, ఉరి తీసినా తప్పు లేదంటూ అభ్యంతరకరంగా మాట్లాడారని, వాటి గురించి ఏ సమాధానం చెప్తారని హరీశ్‌రావు నిలదీశారు.

బీసీ కుల గణన పై చట్టం చేయండి

మొదటిపేజీ తరువాయి...

ఎప్పటిలోగా పూర్తి చేస్తారో కచ్చితంగా నిర్ణీత గడువు విధించాలని డిమాండ్ చేశారు. కుల గణన కోసం బడ్జెట్ కూడా కేటాయించలేదని, ఖర్చును ఏవిధంగా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. కుల గణనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీహార్, కర్ణాటక, ఏపీలో బీసీ కుల గణనను చేపట్టిన అక్కడి ప్రభుత్వాలు ఏండ్లు గడుస్తున్నా.. ఆ నివేదికలను బయటకు ఇవ్వలేదని, తెలంగాణలో కూడా ఆ విధంగా చేయొద్దని సూచించారు. అందుకే ప్రణాళికాబద్ధంగా, చట్టం చేసి కుల గణన చేయాలని కోరారు. లేనిపక్షంలో ఇది ఒక తంతుగానే మిగిలిపోతుందని, దీనివల్ల బీసీలకు ఒరిగేదేమీ ఉండబోదని హెచ్చరించారు. సమగ్ర కుల గణన చేపడితేనే బీసీల లెక్క ఎంతో తేలుతుందని సూచించారు. కేవలం బీసీ కుల గణన చేస్తే ప్రయోజనం ఉండబోదని పేర్కొన్నారు. ఎంబీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? బీసీలకు 42% రిజర్వేషన్లను ఎప్పుడు అమలు చేస్తారు? నియోజకవర్గానికి రూ.50 కోట్లతో నిర్మిస్తామన్న ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యతా భవన్‌లను ఎప్పుడు మొదలు పెడతారని ప్రశ్నించారు.

సమగ్ర సర్వేనా? బీసీ సర్వేనా?

తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పలు సందేహాలు వ్యక్తంచేశారు. తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జనగణన, కుల గణన, సమగ్రసర్వే, బీసీ కుల గణన అంటూ నాలుగు మాటలు మాట్లాడారని ఇందులో ఏది చేస్తారని ప్రశ్నించారు. కుల గణన ప్రక్రియను బీసీ కమిషన్ ద్వారా చేస్తారా? జీఏడీ (ప్రభుత్వం) ద్వారా చేస్తారా? ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేసి చేస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మైనార్టీ కుల గణన కోసం ఏర్పాటుచేసిన రాజేంద్రకుమార్ సచార్ కమిషన్‌కు జ్యుడిషియల్ చట్టబద్ధత ఉన్నదని, రాష్ట్రంలో బీసీ కుల గణనకు ఎలాంటి చట్టబద్ధత లేదని తెలిపారు. తద్వారా భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రావడం ఖాయమని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే దీనికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇది సమగ్ర సర్వేనే: సీఎం రేవంత్‌రెడ్డి

కుల గణనపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సలహాలు, సూచనలు ఇస్తారనుకుంటే అనుమానాలు రేకెత్తిస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రాజేందర్ సచార్ కమిటీ ద్వారా ముస్లింల సర్వే చేపట్టిన విధంగానే తాము కూడా సర్వే చేయనున్నట్టు తెలిపారు. అందరి వివరాలు సేకరిస్తేనే బీసీలకు రాజకీయ, విద్య, ఉపాధి పరంగా న్యాయం చేయగలుగుతామని పేర్కొన్నారు. బీసీ కుల గణన చేస్తుంటే అరశాతం జనాభా ఉన్నవాళ్లకు బాధగా ఉండొచ్చని అన్నారు.

కులగణన నాంది మాత్రమే : భట్టి విక్రమార్క

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అని, కులగణన ద్వారా ఆయా వర్గాలకు సంఖ్యాబలం ఆధారంగా భాగస్వామ్యం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్ కూడా తెస్తామని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను అమలు చేసేందుకు కులగణన నాంది మాత్రమేనని పేర్కొన్నారు. బీసీ కులగణనపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు వెలిబుచ్చిన సందేహాలకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీ కులగణన ద్వారా వచ్చే వివరాల ఆధారంగా భవిష్యత్‌లో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అందరికీ సమాన అవకాశాలు లభించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిపుణులు, మేధావుల సలహాలను కూడా స్వీకరించి ఎన్నికలకు ముందే విధివిధానాలు రూపొందించి కులగణనను చేపడతామని స్పష్టంచేశారు. బీసీ కులగణనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తామని, అన్ని కులాలను సర్వే చేస్తామని చెప్పారు. ఇందులో అన్ని కుటుంబాల వివరాలూ వెల్లడవుతాయని తెలిపారు.

చట్టం అవసరం లేదు: పొన్నం

బీసీ కులగణనపై తమకు చిత్తశుద్ధి ఉన్నదని, అందరి సహకారంతో దీనిని విజయవంతం చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దీనిపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, అందరి సూచనలు, సలహాలు తీసుకుంటామని చెప్పారు. మంత్రిమండలిలో సుదీర్ఘంగా చర్చించిన తరువాతే కులగణన చేయాలని నిర్ణయించినందున దీనికోసం చట్టం చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బీసీలను సీఎంను చేస్తామని చెప్పిన బీజేపీ, తమ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న బీసీని తొలగించిందని విమర్శించారు. కనీసం అసెంబ్లీలో ఆ పార్టీపక్ష నేతగా కూడా బీసీకి అవకాశం ఇవ్వలేదని దుయ్యబట్టారు. చర్చ అనంతరం బీసీ కులగణన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఎన్నికల కోసం వాడుకోవద్దు: పాయల్‌శంకర్

రాజకీయ పార్టీలు ఓట్ల కోసమే బీసీ నినాదాన్ని వాడుకుంటున్నాయి తప్ప సీట్ల విషయం వచ్చేసరికి వారిని విస్మరిస్తున్నాయని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులగణన తీర్మానం ఎన్నికల నినాదం కాకూడదని పేర్కొన్నారు. మైనారిటీలకు 4% రిజర్వేషన్ అమలు చేయడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. బీసీల కులగణనపై అఖిలపక్షంతో చర్చించాలని, కులగణనకు ఒక కమిషన్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు.

రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేసి జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలి: అక్బరుద్దీన్

ముస్లింలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీల కన్నా వెనుకబడి ఉన్నారని, ఈ విషయం సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్ సైతం స్పష్టం చేశాయని మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రిజర్వేషన్లపై 50% సీలింగ్‌ను ఎత్తివేసి జనాభా ఆధారంగా అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని, అందులో ముస్లింలకు 12% రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను అసెంబ్లీ ముందు ఉంచాలని కోరారు.

బిల్లు రూపంలో తెస్తే చట్టబద్ధత ఉంటుంది: కూనంనేని

బీసీ కులగణన అంశాన్ని బిల్లు రూపంలో ప్రవేశపెడితే దానికి చట్టబద్ధత ఉంటుందని సీపీఐ పక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీసీలు ఎంతో కష్టజీవులని, వారికి సంక్షేమ ఫలాలు అందాల్సిందేనని చెప్పారు. కులగణన తీర్మానాన్ని తాము ఆమోదిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మైనారిటీలకు, క్రిష్టియన్ మతం స్వీకరించిన దళితవర్గాలకు కూడా రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు. ఓసీల్లోని పేదలకు కూడా విద్యలో సహకారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బిల్లు పెడితేనే చట్టబద్ధత: కేటీఆర్

బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులగణన తీర్మానాన్ని తాము స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు స్పష్టంచేశారు. బీహార్‌లో జీఏడీ ద్వారా కులగణన చేపట్టేందుకు ప్రయత్నించగా ఇబ్బందులు తలెత్తాయని, అందుకే రాష్ట్రంలో కులగణనకు బిల్లు పెట్టాలని సూచించారు. దీని వల్ల చట్టబద్ధత వస్తుందని, లేనిపక్షంలో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీల హక్కుల కోసం తమ పార్టీ ఎప్పటినుంచో కృషిచేస్తున్నదని వివరించారు. 2004లో యూపీఏ-1 హయాంలో బీసీల హక్కులపై బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్యతో కలిసి అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి దాదాపు చర్చించినట్టు చెప్పారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని తాము ఎంతోకాలంగా కోరుతున్నామని, తెలంగాణ ఏర్పాటు అనంతరం రెండుసార్లు దీనికి అనుకూలంగా అసెంబ్లీ తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించినట్టు గుర్తుచేశారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 5% నిధులు బీసీలకు కేటాయిస్తే రూ. రెండు లక్షల కోట్లు లభిస్తాయని తెలిపారు. రాజేంద్రకుమార్ సచార్ కమిటీ ఏర్పాటులో సైతం కేసీఆర్ పాత్ర ఉన్నదని పేర్కొన్నారు.

బీసీల ఓట్లు దండుకోవడానికే తీర్మానం: జాతీయ జనగణన వేదిక చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల ఓట్లను దండుకోవడానికే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో జనగణనపై తీర్మానం చేసిందని జాతీయ జనగణన వేదిక చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో జనగణనను ఏ పద్ధతిలో చేస్తుందో చెప్పనేలేదని, బడ్జెట్ కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు జనగణన ఎలా చేస్తుందని ప్రశ్నించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని దాదాపు 50 ఏండ్లు పరిపాలన చేసి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ మరోసారి ఓబీసీలను మోసం చేసే ఎత్తు గడగా ఈ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ సర్కారు, ఓబీసీ ప్రధాన మంత్రినని చెప్పుకుంటున్న మోదీ సైతం ఓబీసీలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బీసీలు బుద్ధి చెప్పాలని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

ఆధార్ ఉంటేనే గృహజ్యోతి

- లేనివారు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఆధార్ కార్డు ఉన్నవారికే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. విద్యుత్తు కనెక్షన్ నంబర్‌ను, లబ్ధిదారుల ఆధార్‌తో అనుసంధానం చేయనున్నట్టు తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమిస్తామని చెప్పింది. ఆధార్ లేకపోతే వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించింది. అథెంటిఫికేషన్ చేసే సమయంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్ చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నది. శాశ్వత ఆధార్ నంబర్ వచ్చే వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తోపాటు ఫొటో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్, పాన్, పాస్‌పోర్ట్, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఉపాధి హామీ పథకం కార్డు, కిసాన్ పాస్‌బుక్, డ్రైవింగ్‌లైసెన్స్ లేదా గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నది. ఆథెంటిఫికేషన్ సమయంలో వేలిముద్రలు తీసుకుంటారని, బయోమెట్రిక్ పనిచేయకపోతే ఐరిస్ ద్వారా ప్రయత్నిస్తారని తెలిపింది. అదికూడా పనిచేయని పక్షంలో ఓటీపీ ద్వారా ఆథెంటిఫికేషన్ చేస్తారని, అదీ కాకపోతే ఆధార్ ధ్రువీకరణ పత్రం తీసుకుంటారని వివరించింది.

'యాదాద్రి' ప్లాంట్‌ను త్వరగా పూర్తి చేయాలి

అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశించుకున్న గడువు నాటికి 1,600 మెగావాట్ల విద్యుత్తును అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులను ఆదేశించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనుల పురోగతిపై శుక్రవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. స్టేజ్-1 లోని రెండు యూనిట్లకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాని సూచించారు. గత మూడేండ్లలో జరిగిన పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పర్యావరణ అనుమతులు వచ్చాక చేపట్టే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్